## 200 మీటర్ల వరకు నిషేధం

- అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

04







## ముగిసిన మేడారం హుండీ లెక్కింపు

- అమ్మవార్ల ఆదాయం రూ.13.25 కోట్లు
- 828 హుండీలు.. వారం రోజుల లెక్కింపు..
- గత జాతర స్థాయిలోనే ఆదాయం

04



సంపుటి :02 | సంచిక :305 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

గురువారం 12, ఫిబ్రవరి 2026





## పశ్చిమ రూపురేఖలు మారుస్తాం

- 5 ఏళ్లలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
- మేయర్ తో కలిసి పలు అభివృద్ధి పనులకు
- ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన

05




# టెన్షన్.. టెన్షన్!

## రేపు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు


ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో నెలకొన్న ఉత్కంఠకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది. ఓటరు దేవుడు ఎవరికి పట్టం కట్టాడు? ఎవరిని ఇంటికి పంపాడు? అనేది నేడు తేలిపోనుంది. పోలింగ్ ముగిసినప్పటి నుంచి అభ్యర్థుల్లో మొదలైన 'హార్ట్ బీట్' కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో పీక్స్‌కు చేరింది. గెలుపుపై ధీమా ఉన్నా.. లోలోపల ఏదో తెలియని గుబులు అభ్యర్థులను వెంటాడుతోంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగడంతో ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత మధ్య నేడు అభ్యర్థుల జాతకాలు బయటపడనున్నాయి.

– అక్షర దర్బార్, వరంగల్

- కొన్ని మున్సిపాలిటీల్లో ప్రధాన పార్టీల మధ్య ఉత్కంఠ పోరు
- పోలింగ్ తర్వాత కూడికలు తీసివేతలు.. అయినా రాని స్పష్టత
- ఫలితాలపై ఉమ్మడి జిల్లాలో సర్వత్రా హైటెన్షన్
- గెలిచిన తమ పార్టీ కౌన్సిలర్లను క్యాంపునకు తరలించేందుకు ప్రధాన పార్టీలు రెడీ

02

- ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో కౌంటింగ్ ఏర్పాట్లు
- లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత.. సీసీ కెమెరాలు
- ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్
- అభ్యర్థులు, ప్రధాన రాజకీయ పార్టీల శ్రేణుల్లో నరాలు తెగే ఉత్కంఠ




## పల్లెలకు కేంద్రం ఆర్థిక ఊతం

04

- మరో రూ.387 కోట్లు విడుదల
- రెండు విడతల్లో కలిపి రూ.646 కోట్లు జమ
- అభివృద్ధి పనులకు మార్గం సుగమం
- ఇంకా రూ.2,400 కోట్లు బకాయిలు



భూసేకరణ పూర్తయింది

## పనులు మొదలు పెట్టండి

- మామునూర్ ఎయిర్ పోర్ట్ పై కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి
- కొత్తగూడెం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులపై కూడా చర్చ..
- ఏడాదిలో విమాన సర్వీసులు?

04








02

## ముస్తాబవుతున్న కోటగుళ్లు

- 15 నుంచి 17 వరకు శివరాత్రి ఉత్సవాలు
- జాగరణ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు
- భారీ ఏర్పాట్లు చేస్తున్న కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ
- శివ కళ్యాణ మహోత్సవానికి హాజరుకానున్న ఎమ్మెల్యే గండ్ర

# టెన్షన్.. టెన్షన్!

- రేపు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో కౌంటింగ్ ఏర్పాట్లు
- లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత.. సీసీ కెమెరాలు
- ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్
- అభ్యర్థులు, ప్రధాన రాజకీయ పార్టీల శ్రేణుల్లో నరాలు తెగే ఉత్కంఠ
- కొన్ని మున్సిపాలిటీల్లో ప్రధాన పార్టీల మధ్య ఉత్కంఠ పోరు
- పోలింగ్ తర్వాత కూడికలు తీసివేతలు.. అయినా రాని స్పష్టత
- ఫలితాలపై ఉమ్మడి జిల్లాలో సర్వత్రా హైటెన్షన్
- గెలిచిన తమ పార్టీ కౌన్సిలర్లను క్యాంపునకు తరలించేందుకు ప్రధాన పార్టీలు రెడీ



**అక్షరదర్బార్, వరంగల్ :** మున్సిపల్ ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, సిబ్బందికి ముందస్తుగా శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు స్థాయిల్లో భద్రత ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని ప్రకటించారు. అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లకు గుర్తింపు కార్డుల ఆధారంగా కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం కల్పించాలని నిర్ణయించారు. స్ట్రాంగ్ రూమును అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తెరవనున్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ పేపర్లను లెక్కించనున్నట్లు అధికారులు వెల్లడించారు. చెల్లుబాటు అయ్యే ఓట్లను, చెల్లని ఓట్లను వేరు చేయాలని, నిబంధన ప్రకారం పరిశీలించిన తర్వాతే పోస్టల్ ఓట్లను లెక్కలో చేర్చాలని నిర్ణయించారు. తర్వాత బ్యాలెట్ బాక్స్ లను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తెరిచి కౌంటింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు జరిగే కౌంటింగ్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్లు ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఉమ్మడి వరంగల్ లోని 12 మున్సిపాలిటీల్లో శుక్రవారం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి జరగనుంది. ప్రతి మున్సిపాలిటీలో బుధవారం పోలింగ్ జరగగా బ్యాలెట్ బాక్స్ లను ఆయా మున్సిపాలిటీ పరిధిలోని స్ట్రాంగ్ రూములకు చేర్చిన విషయం తెలిసిందే.

### - టెన్షన్.. టెన్షన్

మరో కొన్ని గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండటంతో సర్వత్రా ఉత్కంఠ చోటుచేసుకుంది. ఆయా మున్సిపాలిటీలోని అభ్యర్థులు, వారి అనుచరులు, ప్రధాన రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తల్లో హైటెన్షన్ కనబడుతుంది. ఇందుకు వివిధ మునిసిపాలిటీల్లోని పలు వార్డుల్లో అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అనే రీతిలో గట్టి పోటీ నెలకొనటమే కారణం. ఉమ్మడి వరంగల్ లోని పలు మున్సిపాలిటీల్లో పోలింగ్ ముగిసిన తర్వాత కూడా గెలుపు ఓటములపై ఏ పార్టీకీ స్పష్టత లభించని పరిస్థితి. స్టేషన్ గణపురం, నర్సంపేట, తొర్రూరు, కేసముద్రం, ములుగు మున్సిపాలిటీలను తమ పార్టీ కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ నేతలు గట్టిగా చెబుతున్నారు. అలాగే డోర్నకల్ తో పాటు మిగతా మున్సిపాలిటీలను కూడా తమ పార్టీ గెలుచుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఇక వర్ధన్నపేట, మరిపెడ, మహబూబాబాద్, పరకాల, భూపాలపల్లి మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ ఆశలు పెట్టుకుంది. వీటిలో గట్టి పోటీ జరగటం వల్ల విశ్లేషకులు సైతం ఈ మున్సిపాలిటీలు ఏ పార్టీ ఖాతాలోకి వెళ్తాయనేది చెప్పలేకపోతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మాత్రం ఎవరికి వారే ఇవి తమవేనని ధీమాతో ఉన్నారు.

### - కూడికలు తీసివేతలు

బుధవారం పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా మున్సిపాలిటీలో ప్రధాన రాజకీయ పార్టీల నేతలు కూడికలు తీసివేతలు చేశారు. ఆయా వార్డు అభ్యర్థితో పాటు తమ పార్టీ ఎన్నికల ఇన్చార్జిలతో స్థానిక ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి గాని సమావేశమై చర్చించారు. అయినా గట్టి పోటీ జరిగిన మున్సిపాలిటీలోని వార్డుల్లో గెలుపు ఓటమిపై నేతలు ఒక అంచనాకు రాలేక పోతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట, మహబూబాబాద్, భూపాలపల్లి, పరకాల వంటి మున్సిపాలిటీలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఇవి తమవేననే ధీమాతో ఉన్నట్టు కనపడుతుంది. ఈ మున్సిపాలిటీల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓటర్లకు డబ్బు పంపిణీ చేయడంలోనూ పోటీ పడటంతో విశ్లేషకులు కూడా గెలుపు ఓటమిపై ఒక అంచనాకు రాలేకపోతున్నారని సమాచారం. దీంతో శుక్రవారం జరిగే ఓట్ల లెక్కింపుపై అభ్యర్థులతో పాటు వారి అనుచరులు, ప్రధాన రాజకీయ పార్టీల ముఖ్య నేతల్లో నరాలు తెగే టెన్షన్ వాతావరణం కనబడుతుంది. ఓట్ల లెక్కింపు అనంతరం వెంటనే ఫలితాలు వెల్లడి కానున్నందున ప్రధాన తమ పార్టీ నుంచి గెలిచిన కౌన్సిలర్లను క్యాంపులకు తీసుకెళ్లే ఏర్పాట్లలో ప్రధాన రాజకీయ పార్టీలు ఉన్నట్లు తెలిసింది.

## 3 రౌండ్లలో కౌంటింగ్

- ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీకి నిర్వహించిన ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. ఓట్ల లెక్కింపును పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు డా బీఆర్ అంబేడ్కర్ క్రీడా ప్రాంగణంలోని మిని ఫంక్షన్ హాలులో మొత్తం 10 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి టేబుల్‌కు ఒకరేసి 10 మంది రిటర్నింగ్ అధికారులు నియమించినట్లు తెలిపారు. అదనంగా కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు 12 మంది టేబుల్ సూపర్‌వైజర్లు, 20 మంది అసిస్టెంట్లు, అలాగే ఇతర సహాయక సిబ్బంది 40 మందిని నియమించినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపును మొత్తం 3 రౌండ్లలో పటిష్ట పర్యవేక్షణ, వీడియో గ్రఫి మధ్య నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రౌండ్ అనంతరం ఫలితాలను స్పష్టంగా ప్రకటించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

: ములుగు కలెక్టర్ దివాకర టి.ఎస్.

అక్షర దర్బార్, వెంకటాపూర్: రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాన్ని సుందరీకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.గురువారం వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప ఆలయంలో మహా శివరాత్రి ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, త్రాగునీరు, విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్, ఆర్డీఓ వెంకటేష్, ఆలయ ఈవో శ్రీనివాస్ ఉన్నారు.

## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సంకీర్త్



అక్షర దర్బార్, భూపాలపల్లి:మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీ ర్త్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని గెలిచిన అభ్యర్థులకు సూచించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు లు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తామని హెచ్చరించారు. లెక్కింపు కేం ద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బందో బస్తు, క్యూ.ఆర్.టి., డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు సామరస్య వాతావరణాన్ని కాపాడుతూ ఫలితాలను గౌరవంగా స్వీకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

### కోట గుళ్లను సందర్శించిన ఎస్పీ

రానున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధ కోటగుళ్లను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవుడి ఆశీస్సులు పొందారు. మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ఆలయం వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్ల (బందోబస్తు) పై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు



## సింగరేణి సీఎండీగా డా. జ్యోతి బుద్ధ ప్రకాష్ బాధ్యతల స్వీకరణ

అక్షర దర్బార్, భూపాలపల్లి: సింగరేణి కాలరీస్ సంస్థ ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డా. జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు, ఉన్నతాధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 2002 బ్యాచ్‌కు చెందిన డా. జ్యోతి బుద్ధ ప్రకాష్ ఇటీవల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా సేవలందించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా, భద్రాచలం ఐటిడిఏ పీవోగా కూడా పనిచేశారు. సీనియర్ అధికారిగా గుర్తింపు పొందిన ఆయన బాధ్యతల స్వీకరణపై సంస్థ వర్గాల్లో హర్షం వ్యక్తమైంది.

## ముస్తాబవుతున్న కోటగుళ్లు

- 15 నుంచి 17 వరకు శివరాత్రి ఉత్సవాలు
- జాగరణ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు
- శివ కళ్యాణ మహోత్సవానికి హాజరుకానున్న ఎమ్మెల్యే గండ్ర

అక్షరదర్బార్, గణపురం: ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్ళు మహాశివరాత్రి శివ కళ్యాణ మహోత్సవానికి ముస్తాబవుతుంది. కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా శివరాత్రి మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తుంది. శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 15 ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం గణపతి పూజతో ఆలయ అర్చకులు గంగాధర్, నాగరాజులు పూజా కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. 15 రాత్రి మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఎనిమిది గంటలకు శివ కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ ధర్మకర్తలు అట్లూరి వెంకటలక్ష్మి నరసింహారావు పావన రాజ్యలక్ష్మి దంపతులు నిర్వహించనున్నారు.

### - హాజరుకానున్న ప్రముఖులు

ఉత్సవాలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరుకానున్నారు. అదేవిధంగా ఆలయ పోషకులు నిజామాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పోతరాజు సాయి చైతన్య కీర్తి దంపతులు, లలిత నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ రాజేశ్వరప్రసాద్ లలిత దేవి దంపతులు డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ సుమతి దంపతులు భూపాలపల్లి సీఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్ లక్ష్మీ దంపతులు, గంగాధర తహసిల్దార్ అంబటి రజిత సురేష్ దంపతులు శివ కళ్యాణ మహోత్సవానికి హాజరు కానున్నారు.

# కురిసిన 'నోట్ల' వర్షం

- ఓటుకు రూ. 5వేల నుంచి 7వేల వరకు పంపిణీ?
- నలుగురు ఓటర్లు ఉంటే రూ. 50 వేలు..
- పట్టణంలో జోరుగా సాగుతున్న చర్చ



అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల వేళ రాజకీయం రసవత్తరంగా మారింది. ప్రచారం ముగిసి పోలిం గ్ ఘట్టం ముగిసినా, పట్టణంలో జరిగిన నగదు పంపిణీ గురించిన చర్చ మాత్రం ఇంకా చల్లారలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అభ్యర్థులు ఓటర్లపై నోట్ల వర్షం కురిపించారనే వార్తలు స్థానికంగా సంచలనం సృష్టిస్తున్నాయి.

## - ఫ్యామిలీ ప్యాకేజీ'లు!

ఈసారి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు భారీగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. పట్టణం లోని కీలక వార్డుల్లో ఒక్కో ఓటుకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు పంపిణీ జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా ఒకే ఇంట్లో నలుగురు ఓటర్లు ఉంటే, సదరు కుటుంబానికి ఏకంగా రూ.50 వేల వరకు ముట్టజెప్పినట్లు సమాచారం. డబ్బుతో పాటు ఇతర ప్రలోభాలు కూడా భారీగానే అందినట్లు స్థానికులు చర్చించు కుంటున్నారు.

## - 'విందుల' జాతర

ఎన్నికలకు ముందు సుమారు పది రోజుల పాటు పరకాల పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు వినూత్నంగా ప్రయత్నించారు. ఒకరోజు చికెన్, మరోరోజు మటన్, ఇంకోరోజు చేపల విందులతో ఓటర్ల ఇళ్లను నింపేశారు. నాన్-వెజ్ విందులతో పాటు కూల్ డ్రింక్స్, ఇతర బహుమతుల పంపిణీ జోరుగా సాగింది.

## - ఓటరు తీర్పుపై ఉత్కంఠ..

అయితే, ఇక్కడే అసలు ట్విస్ట్ నెలకొంది. అభ్యర్థులు ఎంతగా ప్రలోభపెట్టినా, ఓటర్లు మాత్రం అత్యంత చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. "అందరి దగ్గరా తీసుకున్నాం.. కానీ ఓట్లు మాత్రం అందరికీ సమానంగానే వేశాం" అని కొందరు ఓటర్లు బాహాటంగానే వ్యాఖ్యానిస్తుండటం అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. డబ్బులు తీసుకుని ఓట్లు ఎవరికి వేశారనే అంశంపై స్పష్టత లేకపోవడంతో, తుది ఫలితం ఎలా ఉండబోతుందోనన్న ఉత్కంఠ పట్టణంలో నెలకొంది. ఈ 'నోట్ల వర్షం' ఎవరిని గట్టెక్కిస్తుంది? ఎవరిని ముంచేస్తుంది? అన్నది వేచి చూడాలి.

# లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచేయలి

### వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద



నర్సంపేట అక్షర దర్బార్@రేపు జరిగే ఎన్నికలలో లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా,పారదర్శకంగా పూర్తిచేయలనీ వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికార సూచించారు. గురువారం నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన నర్సంపేట మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలలో వార్డు ల వారీగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుల్స్, అభ్యర్థుల గ్యాలరీలను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులకు, మీడియా సౌకర్యాలు పరిశీలించారు. అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని, మొత్తం 6 రౌండ్లలో, 10 టేబుళ్ల ద్వారా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ ఉమారాణి, మునిసిపల్ కమిషనర్ భాస్కర్, తహశీల్దార్ రవిచంద్రరెడ్డి, సిఐ సాయి రమణ దుగ్గొండి ఎస్ఐ రణధీర్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహన దొంగల

# ముఠా గుట్టురట్టు

- ఏడుగురు అరెస్ట్, 15 బైక్ లు స్వాధీనం
- నిందితుల్లో నలుగురు మైనర్లు..
- వరంగల్, హైదరాబాద్ లలో వరుస చోరీలు



అక్షరదర్బార్, హనుమకొండ: జల్సాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను సంగెం, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వీరిలో నలుగురు మైనర్లు ఉండటం గమనార్హం. నిందితుల నుండి సుమారు రూ.15 లక్షల విలువైన 15 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రధాన నిందితులు హనుమకొండకు చెందిన దరాంగుల అంజీ, ఉర్సు సంతోష్, జైదా రామకృష్ణ (జమ్మికుంట)తో పాటు మరో నలుగురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## - జల్సాల కోసం దొంగతనాలు

ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ గురువారం వెల్లడించారు. నిందితులంతా ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో స్నేహం ఏర్పడింది. వచ్చిన ఆదాయంతో మద్యం సేవించడం, విలాసాలకు పాల్పడటం వీరికి అలవాటుగా మారింది. ఆ డబ్బు సరిపోకపోవడంతో, పార్కింగ్ చేసిన వాహనాల తాళాలు తీసి చోరీ చేయడం మొదలుపెట్టారు. చోరీ చేసిన వాహనాలను హన్మకొండలోని పద్మాక్షమ్మ గుట్ట ప్రాంతంలో రహస్యంగా దాచి ఉంచేవారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని సుబేదారి (5), సంగెం (2), హసన్‌పర్తి (2), మిల్స్ కాలనీ (2), ధర్మసాగర్ (1), హన్మకొండ (1) పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ, హైదరాబాద్‌లోని మేడిపల్లి (2) పరిధిలోనూ వీరు మొత్తం 15 వాహనాలను దొంగిలించారు.

## - పోలీసులకు చిక్కిన తీరు

ఈ నెల 1న సంగెం మండలం ఆశాలపల్లిలో బైక్ చోరీ జరగడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను గుర్తించిన పోలీసులు, గురువారం ఉదయం గవిచర్ల గ్రామ గుండు సమ్మయ్య ఆలయం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా, రెండు బైక్‌లపై వెళ్తున్న ఆరుగురు నిందితులను అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు తమ నేరాలను అంగీకరించారు. వారి సమాచారంతో పద్మాక్షి గుట్ట వద్ద దాచిన మిగతా బైక్‌లను రికవరీ చేశారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన మామునూరు ఏసీపీ వెంకట్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, సీసీఎస్ సీఐ రాఘవేందర్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు

### : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



అక్షర దర్బార్, నర్సంపేట : మున్సిపాలిటీ ఎన్నికల్లో నర్సంపేట ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సంపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందన్నారు. రేపు జరిగే ఓట్ల లెక్కింపుకు అభ్యర్థులు, ఏజెంట్లు నిర్ణీత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు చేరుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికార పార్టీ నాయకులు, పోలీసుల ఒత్తిళ్లను తట్టుకుని పార్టీ విజయం కోసం శ్రమించిన అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్నికల కౌంటింగ్ కు ఏర్పాట్లు పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి: 13న నిర్వహించనున్న పురపాలక సంస్థల ఓట్ల లెక్కింపును పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, టేబుల్‌వైజ్ కౌంటింగ్, బ్యాలెట్ వేర్పాటు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విధానాలపై అవగాహన కల్పించారు. లెక్కింపు కేంద్రాల వద్ద పకడ్బందీ భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని, గుర్తింపు కార్డు ఉన్నవారికే ప్రవేశమని తెలిపారు. సిబ్బంది సమయానికి హాజరై నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోనా, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఆదర్శవాణి విద్యార్థులు

అక్షర దర్బార్, దుగ్గొండి : ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహించిన సీఎం కప్ సెకండ్ ఎడిషన్ క్రీడా పోటీల్లో దుగ్గొండి ఆదర్శవాణి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. కోకో, కబడ్డీ, అథ్లెటిక్స్, జూడో, రెజ్లింగ్ విభాగాల్లో పాఠశాలకు చెందిన 20 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. అదేవిధంగా వరంగల్ ఓసిటీ గ్రౌండ్‌లో నిర్వహించిన ఖోఖో పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "పల్లె నుంచి పట్నం వరకు" కార్యక్రమంలో భాగంగా గ్రామీణ క్రీడాకారులకు సీఎం కప్ వేదిక కల్పించిందని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా చైర్మన్ నాగనబోయిన రవి, డైరెక్టర్ కవిత భిక్షపతి మాట్లాడుతూ.. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీ ఆదర్శవాణి విద్యా సంస్థల చైర్మన్ నాగన బోయిన రవి గారు డైరెక్టర్ కవిత భిక్షపతి, ప్రిన్సిపాల్ స్రవంతి పాల్గొన్నారు.

# వరంగల్ కు రైల్వే మెగా బూస్ట్!

- రూ.వెయ్యి కోట్లతో తొలి ఫ్రైట్ స్టేషన్
- గూడ్స్ రైళ్ల మరమ్మతులకు కేరాఫ్ కానున్న వరంగల్

అక్షరదర్బార్, వరంగల్ : తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల కల్పన దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర రైల్వే చరిత్రలో మైలురాయిగా నిలిచే విధంగా రూ.1,000 కోట్ల వ్యయంతో 'మెగా ఫ్రైట్ ఎగ్జామినేషన్ స్టేషన్' ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ మెగా ప్రాజెక్టును వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయనుండటం విశేషం. గూడ్స్ రైలు వ్యాగన్ల రిపేర్, నిర్వహణ కోసం ఉద్దేశించిన ఈ స్టేషన్ తెలంగాణలోనే మొట్టమొదటిది. ప్రస్తుతం ఉన్న రద్దీని దృష్టిలో ఉంచుకుని, గూడ్స్ రైళ్ల రాకపోకలు మరింత వేగవంతం చేయడానికి ఈ 'మెగా ఫ్రైట్ ఓవర్ హాలింగ్' కేంద్రం కీలక పాత్ర పోషించనుంది.



**- ప్రాజెక్టు ముఖ్యాంశాలు**

మొత్తం పెట్టుబడి రూ.1,000 కోట్లు. గూడ్స్ రైలు వ్యాగన్ల క్షుణ్ణమైన తనిఖీ, మరమ్మతులు, ఆధునీకరణ పనులను ఇక్కడ చేపడతారు. ఈ ప్రాజెక్టుతో వందలాది మంది సాంకేతిక నిపుణులకు, స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. వరంగల్ జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ఈ భారీ రైల్వే స్టేషన్ దోహదపడనుంది.

**- రైల్వే వ్యవస్థ బలోపేతం**

గూడ్స్ రైళ్ల నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు వరంగల్‌లోనే ఈ సదుపాయం అందుబాటులోకి రావడం వల్ల దక్షిణ మధ్య రైల్వేలో సరకు రవాణా సామర్థ్యం మరింత పెరుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. తెలంగాణలో రైల్వే కనెక్టివిటీని పటిష్టం చేయడమే లక్ష్యంగా ఈ భారీ కేటాయింపులు చేసినట్లు కేంద్రం పేర్కొంది. ఈ స్టేషన్ ఏర్పాటుతో సరకు రవాణా రైళ్ల ఆలస్యం తగ్గి, దక్షిణ భారతదేశంలో లాజిస్టిక్స్ రంగం మరింత వేగవంతం కానుంది

## చెన్నారావుపేటలో చైన్ స్నాచింగ్

అక్షర దర్బార్, చెన్నారావుపేట : చెన్నారావుపేట మండలంలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం బాధిత మహిళ నెక్కొండ వైపు నుంచి బస్సు దిగిన అనంతరం ఆటోలో కొంత దూరం ప్రయాణించి, గూడూరు వైపు పుల్లయ్యబోడు తండా–గుండెంగ రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి దాడి చేయడంతో మహిళ కిందపడింది. అనంతరం ఆమె మెడలో ఉన్న పుస్తేలతాడును లాక్కొని నిందితుడు గూడూరు వైపుగా పరారైనట్లు సమాచారం. ఘటన అనంతరం బాధితురాలు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయమై ఎస్సైను వివరణ కోరగా, కాల్ వచ్చినట్లు స్పష్టం చేశారు. బాధితురాలు చెన్నారావుపేట మండలం కందిగడ్డ తండాకు చెందిన అంగన్వాడీ టీచర్‌గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

అక్షరదర్బార్, పరకాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి, ఐసీటియు జిల్లా అధ్యక్షుడు బొట్ల ప్రభాకర్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా హుజురాబాద్ రోడ్డులోని పెట్రోల్ పంపు నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా అమరధామం వరకు డప్పు చప్పులతో కార్మిక మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు ఏఐటియుసి నాయకుడు లంకదాసరి అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చారని విమర్శించారు. 'హైర్ అండ్ ఫైర్' విధానం, 12 గంటల పని, సమ్మె హక్కుపై పరిమితులు వంటి చర్యలు కార్మిక హక్కులను హరించేవని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, 50 ఏళ్లు పైబడిన వారికి రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ సవరణ చట్టం–2025, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో 100% విదేశీ పెట్టుబడుల అనుమతి వంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు

**–నర్సంపేట ఏసీపీ పున్నం రవీందర్ రెడ్డి**

అక్షర దర్బార్, నర్సంపేట: నిన్న నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకుని జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట ప్రాంతాల్లోని కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు నర్సంపేట ఏసీపీ పున్నం రవీందర్‌రెడ్డి తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్.ఎస్ సి.ఆర్.పి.సి 163 సెక్షన్ ప్రకారం ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు రేపు ఉదయం 6 గంటల నుంచి 14వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఉత్తర్వులను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ హెచ్చరించారు.

## లేబర్ కోడులు రద్దు చేసే వరకు ఉద్యమాలు ఆగవు

**ఏఐఎఫ్ టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేష్**

అక్షర దర్బార్, నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని, లేదంటే కార్మిక ఉద్యమాలు ఆగవని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేష్ హెచ్చరించారు. కార్మిక సంఘాల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా గురువారం నర్సంపేట పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. బీఆర్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ), ఏఐటీయూసీ, సీఐటీసీ, ఐఎఫ్‌టీ, టీయూసీ సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రోడ్డు కూడలి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు కార్మికులు ప్రదర్శన చేపట్టారు. అనంతరం జరిగిన సభలో మోడెం మల్లేష్ మాట్లాడుతూ, కార్మికులు ఎన్నో పోరాటాలతో సాధించుకున్న హక్కులను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేబర్ కోడ్ల రూపంలో హరిస్తున్నారని




విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుంపెల్లి మునీశ్వరు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్, ఆశా యూనియన్ నాయకులు కలువల లలిత, సంధ్య, సీఐటీయూ పట్టణ కార్యదర్శి కందికొండ రాజు  పాల్గొన్నారు.



## బాల్య వివాహాలను అరికట్టాలి

**తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్**

అక్షర దర్బార్, శాయంపేట: బాల్యవివాహాలను అరికట్టాలని శాయంపేట తహసీల్దార్ ఆర్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువా మహిళా శిశు సంక్షేమ శాఖ, షేర్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల్యవివాహాల నిర్మూలన చైతన్య రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ జి. ప్రభావతి, సీనియర్ అసిస్టెంట్ అచ్చారావు, జిపిఓ వంగిటి సత్యం, జూనియర్ అసిస్టెంట్ పి. రాజు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ రూపురేఖలు మారుస్తాం

- 5 ఏళ్లలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
- రూ.530 కోట్లతో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం
- మేయర్ తో కలిసి పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని, ఐదేళ్ల కాలంలో నియోజకవర్గ స్వరూపాన్నే మారుస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధిని ఈ కొద్ది కాలంలోనే నిధులను సాధించి చూపిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గురువారం నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రూ.కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

**- రూ.530 కోట్లతో 'జల' సిరి**

నియోజకవర్గంలో దశాబ్దాలుగా వేధిస్తున్న తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే నాయిని కీలక ప్రకటన చేశారు. గత పాలకులు విస్మరించిన సమస్యలను తాము ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. "నీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించేందుకు ప్రభుత్వం నుండి రూ.530 కోట్ల భారీ నిధులను మంజూరు చేయించాం. ఈ పనులు పూర్తయితే పశ్చిమ నియోజకవర్గంలో తాగునీటి ఇబ్బందులు అనే మాట వినిపించదు" అని ఆయన స్పష్టం చేశారు.

**- డివిజన్ల వారీగా శంకుస్థాపనలు:**

5వ డివిజన్ లో రూ.90 లక్షలతో మార్కాజీ స్కూల్ నుండి



మంగలి వాగు బ్రిడ్జి వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. 30వ డివిజన్ లో చిల్డ్రన్ పార్కులో రూ.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న మౌలిక వసతుల కల్పన పనులకు భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, రావుల కోమల, డివిజన్ అధ్యక్షులు స్రవంతి, రమేష్, నాయకులు బొంత సారంగం, మాజీ కార్పొరేటర్ మాధవి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



# ముగిసిన మేడారం హుండీ లెక్కింపు

- అమ్మవార్ల ఆదాయం రూ.13.25 కోట్లు
- 828 హుండీలు.. వారం రోజుల లెక్కింపు.. వెల్లువెత్తిన భక్తుల కానుకలు
- పెరిగిన హుండీల సంఖ్య.. గత జాతర స్థాయిలోనే ఆదాయం

అక్షరదర్బార్, హనుమకొండ : ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ఆదాయపు లెక్కలు తేలాయి. గత వారం రోజులుగా హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో కొనసాగుతున్న హుండీ లెక్కింపు ప్రక్రియ బుధవారంతో అధికారికంగా ముగిసింది. లక్షలాది మంది భక్తులు తమ ఆరాధ్య దైవాలకు సమర్పించుకున్న కానుకల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. వారం పాటు 400 మంది సిబ్బంది శ్రమ దేవాదాయ శాఖ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో, అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ లెక్కింపు సాగింది. సుమారు 400 మంది సిబ్బంది అహర్నిశలు శ్రమించి 828 హుండీల్లోని నగదును లెక్కించారు. మొత్తం నగదు రూ.13,25,83,269,శనగదుతో పాటు భారీగా విదేశీ కరెన్సీ, బంగారం, వెండి ఆభరణాలు, రద్దైన పాత నోట్లు కూడా లభించాయి.

## - గతంతో పోలిస్తే ఆసక్తికర గణాంకాలు

ఈసారి హుండీల సంఖ్య పెరిగినప్పటికీ, ఆదాయం మాత్రం గత జాతర స్థాయిలోనే ఉండటం గమనార్హం. గత జాతర సమయంలో 540 హుండీల ద్వారా రూ.13. 25 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుత జాతరలో హుండీల సంఖ్యను 828కి పెంచినప్పటికీ, ఆదాయం దాదాపు అదే స్థాయిలో రూ.13.25 కోట్లు నమోదైంది. "హుండీల సంఖ్య గణనీయంగా పెంచినప్పటికీ, ఆదాయం ఆ స్థాయిలో పెరగకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భారీ ఆదాయం సమకూరింది" అని అధికారులు అభిప్రాయపడ్డారు.


## - అభివృద్ధి పనులకు నిధులు

హుండీల ద్వారా వచ్చిన ఈ ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకుల్లో జమ చేయనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నిధులను మేడారం క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టే శాశ్వత అభివృద్ధి పనులకు వినియోగించనున్నారు.

# పల్లెలకు కేంద్రం 'ఆర్థిక' ఊతం

- మరో రూ.387 కోట్ల విడుదల
- రెండు విడతల్లో కలిపి రూ.646 కోట్లు జమ
- అభివృద్ధి పనులకు మార్గం సుగమం
- ఇంకా రూ.2,400 కోట్ల బకాయిలు

అక్షరదర్బార్, వరంగల్ : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం మరోసారి తీపి కబురు అందించింది. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రెండో విడతగా రూ.387 కోట్లను గురువారం విడుదల చేసింది. గత వారం మొదటి విడత నిధులు విడుదల చేసిన కేంద్రం, ఇప్పుడు రెండో విడతను కూడా విడుదల చేయడంతో గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు కొత్త ఊపిరి అందనుంది.



రాష్ట్రంలో గ్రామ పంచాయతీల కాలపరిమితి ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో సాంకేతిక కారణాల రీత్యా కేంద్రం గతంలో నిధులను నిలిపివేసింది.

ఇటీవల పంచాయతీ ఎన్నికలు పూర్తి కావడంతో పాటు, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ పంపిన నివేదికల ఆధారంగా కేంద్ర ఆర్థిక శాఖ ఈ నిధులను మంజూరు చేసింది. మొదటి విడత రూ.259.36, రెండో విడత రూ.387 కోట్లు, మొత్తం రూ.646.36 కోట్లు విడుదల చేసింది.

## - ఖాతాల్లోకి నిధులు

ఈ నిధులు నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాల్లోకి జమ కానున్నాయి. వీటిని ప్రధానంగా మురికి కాలవల పూడికతీత, చెత్త సేకరణ, తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వహణ, పైపులైన్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు వినియోగించనున్నారు.

## - ఇంకా రావాల్సిన నిధులు

15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం తెలంగాణకు కేంద్రం నుంచి సుమారు రూ.3 వేల కోట్లకు పైగా నిధులు రావాల్సి ఉంది. తాజా విడుదలతో కలిపి సుమారు రూ.646 కోట్లు అందగా, ఇంకా రూ.2,400 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. మార్చి 31లోపు ఈ నిధులు విడుదల కాకపోతే అవి ల్యాప్స్ అయ్యే ప్రమాదం ఉందని, పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కేంద్రాన్ని కోరారు.

# 200 మీటర్ల వరకు నిషేధం

- అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం జనగామ, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేటలో కౌంటింగ్ జరగనున్న దృష్ట్యా శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్, ఎస్ సీ ఆర్ పీసీ 163 ప్రకారం ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధించడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ నిషేధం శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు అంటే 14 ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సన్ ప్రీత్ హెచ్చరించారు. మున్సిపాలిటీల్లో బుధవారం పోలింగ్ జరగగా బ్యాలెట్ బాక్స్ లను ఆయా మున్సిపాలిటీ పరిధిలోని స్ట్రాంగ్ రూములకు తరలించిన విషయం తెలిసిందే. ఈ స్ట్రాంగ్ రూముల వద్ద శుక్రవారం ఓట్ల లెక్కింపునకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.



# భూసేకరణ పూర్తయింది పనులు మొదలుపెట్టండి

- మామునూర్ ఎయిర్ పోర్ట్ పై కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి
- కొత్తగూడెం, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టులపై కూడా చర్చ.. ఏడాదిలో విమాన సర్వీసులు?

అక్షరదర్బార్, వరంగల్ : వరంగల్ చుట్టుపక్కల ప్రజల దశాబ్దాల కల మామునూర్ ఎయిర్‌పోర్ట్ త్వరలోనే సాకారం కాబోతోంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి గురువారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మామునూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరపున చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి స్పష్టం చేశారు. వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్న ప్రభుత్వం, దానికి అత్యంత కీలకమైన విమానాశ్రయ పనులను వేగవంతం చేసింది. ఎయిర్‌పోర్ట్ విస్తరణకు అవసరమైన అదనపు భూమిని సేకరించి సిద్ధంగా ఉంచామని, ఇక కేంద్రం తరపున పనులు ప్రారంభించడమే మిగిలిందని సీఎం వివరించారు. రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనుల కోసం అవసరమైన అనుమతులు ఇచ్చి, పనులను తక్షణమే ప్రారంభించాలని కోరారు.

## - మరో మూడు ఎయిర్ పోర్టులు

కేవలం వరంగల్ మాత్రమే కాకుండా రాష్ట్రంలోని ఇతర కీలక ప్రాంతాల్లో కూడా విమానయాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రితో చర్చించారు. దీని కోసం అదనంగా 249.82 ఎకరాల భూమిని అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఏడాదిలోపు పనులు పూర్తి చేసి ఎయిర్‌బస్ సేవలు ప్రారంభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కొత్తగూడెం (పాల్వంచ) ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అబ్స్టాకిల్ లిమిటేషన్ సర్ఫేస్ (ఓఎల్ఎస్) సర్వే, ఫీజిబిలిటీ స్టడీని త్వరగా నిర్వహించాలని కోరారు. పెద్దపల్లి (అంతర్గాం) ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించామని, దానికి తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని విన్నవించారు.

## - కేంద్ర మంత్రి సానుకూల స్పందన

ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ విషయంలో భూసేకరణ పూర్తి కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులతో చర్చించి పనులను త్వరితగతిన పట్టాలెక్కిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో విమానయాన రంగాన్ని విస్తరించడం ద్వారా ఆర్థిక వృద్ధి వేగవంతమవుతుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాటాలే మార్గం

## : సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి రెడ్డి సాంబశివ

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం: కేంద్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలే మార్గమని ములుగు జిల్లా సీపీఎం కార్యదర్శి బి. రెడ్డి సాంబశివ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం వెంకటాపురం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి, ఎంపీడీవో కార్యాలయం వద్ద సభ చేపట్టారు. సభలో ఆయన మాట్లాడుతూ.. లేబర్ కోడ్ల ద్వారా కార్మిక హక్కులను హరించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. శతాబ్దకాల పోరాటాల ఫలితంగా వచ్చిన హక్కులను కాపాడుకోవాలంటే ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మండల కార్యదర్శి జ్ఞానం వాసు మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను వెంటనే భర్తీ




చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కట్ల నరసింహాచారి, బిఎన్ కుమారి, రత్నకుమారి, ప్రేమ కుమారి, సడాలు, రంజిత్, జనగం శ్రీను, రాంప్రసాద్, సుధాకర్, అశోకు, ముదిబాక వీరబ్రహ్మం, నాగమణి, ఉషా, భాగ్య, ప్రభావతి, లక్ష్మీ పోశాలు, సమ్మయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915